www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 7 మార్చి 2023
5
ఏలూరు



సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్

ఏలూరు కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగర ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి, సందేహాల నివృత్తికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. ప్రజలు టోల్ ఫ్రీ నెం: 1800-425-4287కునిి, గ్రీవెన్స్ సెల్ నెం: 08812-232101కునిి, వాట్సాప్ నెంబరు 8978999955కునిి ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల్లోపు కాల్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మామిడికి తెగుళ్ల గండం..!

ఇప్పటికీ పూత, పిందె దశలోనే పంట
అనుకూలంగా లేని వాతావరణ పరిస్థితులు
నల్లతామర తెగుళ్ల దాడితో దెబ్బతింటున్న పూత
సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహనలో అధికారులు విఫలం
పెట్టుబడులైనా వస్తాయా అంటూ రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మామిడి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చివరి దశకు చేరుకోవాల్సిన పంట ఇప్పటికీ పూత, పిందె దశలోనే ఉండటంతో దిగుబడిపై రైతులు కంగారుపడుతున్నారు. రాత్రిపూట చలిగాలులు, పగటిపూట పెరిగిన ఉష్ణోగ్రతలతో మామిడి పంటకు వాతావరణం అనుకూలించడం లేదు. నల్లతామర వంటి తెగుళ్ళ సోకి పూత దెబ్బతినడంతో మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా మామిడి సాగవుతోంది. ఒక్క నూజివీడు నియోజకవర్గంలోనే దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి సాగు ఉంది. డిసెంబర్, జనవరి నెలల్లో పూత పూసి ఏప్రిల్ నాటికి మామిడి పంట చేతికి రావాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటికీ పూత, పిందె దశలో మామిడి పంట ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పూత నిలబడటం లేదని రైతులు గగ్గోలుపెడుతున్నారు. ఎకరం భూమిలో లేత మామిడి చెట్లు అయితే 45, ముదురు చెట్లు అయితే 25 వరకూ ఉంటాయి. ఇటీవల కాలంలో తెగుళ్ల బెడద పెరిగిపోవడంతో పురుగు మందులు పెద్దఎత్తున పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి తడిసిమోపెడవుతోంది. ఎకరానికి రూ.40 వేలు కౌలుకు, పెట్టుబడి ఖర్చులు కలిపి ఎకరాకు దాదాపు రూ.60 వేలకు పైగా అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. బాగా పండితే ఎకరం మామిడితోటలో 15 టన్నుల వరకూ దిగుబడి రావాలి. కానీ ఈ ఏడాది పూత దశలోనే తెగుళ్ళ బెడద పెరిగిపోవడంతో దిగుబడిపై తీవ్రప్రభావం చూపనున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది కనీసం పెట్టుబడులైనా వస్తాయా అంటూ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

హార్టీకల్చర్ అధికారుల పర్యవేక్షణ కరువు

మామిడి పంటకు సంబంధించి హార్టీకల్చర్ అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు రైతులు చెబుతున్నారు. నూజివీడు పరిసర ప్రాంతాల్లో మామిడిసాగు పెద్దఎత్తున సాగవుతోంది. కానీ ఈ ప్రాంతంలో హార్టీకల్చర్ ఎడి హోదా అధికారి లేకుండాపోయారు. నూజివీడు మండలంలోని హార్టీకల్చర్ అధికారే ఇక్కడ నాలుగు మండలాలకు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. మామిడి పంటలకు తెగుళ్ల సోకితే ఏ పురుగుమందులు పిచికారి చేయాలన్న అవగాహన రైతులకు కల్పించేవారే లేకుండా పోయారు. దీంతో ఎరువుల విక్రయించే దుకాణదారులు చెప్పిందే వేదం అన్నట్లు సాగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గడిచిన రెండు, మూడేళ్లుగా మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా న్యూజివీడు ప్రాంతంలో హార్టీకల్చర్ ఎడి అధికారిని నియమించి రైతులకు అవగాహన కల్పించడంలో చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. అంతేకాకుండా న్యూజివీడులో మామిడి మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రతి మండలానికి హార్టికల్చర్ అధికారిని నియమించాలి

నిమ్మగడ్డ నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

ఈఏడాది మామిడి పంట ఏమాత్రం ఆశాజనకంగా లేదు. తెగుళ్లబెడదతో పూత దశలోనే పంట దెబ్బతిన్న పరిస్థితి నెలకొంది. అత్యధికంగా మామిడి పండించే న్యూజివీడు ప్రాంతంలో ప్రతిమండలానికి హార్టికల్చర్ అధికారిని నియమించాలి. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఏడి స్థాయి అధికారిని నియమించాలి.మార్కెంటింగ్ సెంటర్ ఏర్పాటు చేయడంతోపాటు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించేందుకు సీనియర్ సైంటిస్టులు నియమించాలి.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఒత్తిడిని జయిస్తే బంగారు భవిష్యత్తు

మానసిక ఆరోగ్యంపై ఓరియంటేషన్ శిక్షణ ప్రారంభోత్సవంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

మానసిక ఆరోగ్యం పట్ల సమాజంలో ముఖ్యంగా విద్యా వ్యవస్థలో మార్పు రావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక గిరిజన భవన్‌లో ఆత్మహత్యల నివారణ కోసం లైన్ డిపార్ట్‌మెంట్స్‌కు అవగాహన కోసం మానసిక ఆరోగ్యంపై ఓరియంటేషన్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం ద్వారా ఒత్తిడిని అధిగమించొచ్చన్నారు. కష్ట సమయంలో కుంగిపోకుండా ఉండగలిగితే మెదడు సక్రమంగా పని చేస్తుందన్నారు. ఒత్తిడికి గురికాకుండా సమస్య పరిష్కార దిశగా ఆలోచించాలని పలువురు మానసిక నిపుణులు చెబుతున్నారన్నారు. మొబైల్, సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లపై అధిక సమయాన్ని వెచ్చించకుండా సరిపడినంత నిద్ర, వ్యాయామం, యోగా, కుటుంబం, స్నేహితులతో మంచి సంబంధాలు కలిగి ఉండటం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవచ్చన్నారు. మన శరీరానికి బ్రెయిన్ ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటిదని, అనవసరపు అంశాలతో దానిని ఒత్తిడికి గురిచేయకుండా ప్రశాంత జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మెడిటేషన్ వల్ల ఎంతటి ఒత్తిడైనా మటుమాయమవుతుందని అన్నారు. చిన్న విషయాలను కూడా అతిగా ఊహించడం ఆత్మహత్యలకు కారణమవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చిన్న కష్టం ఎదురైనా, అవమానం కలిగినా, ఓటమి ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మందలించారనో ఆత్మహత్య ఆలోచనకు వెళ్లకూడదన్నారు. ఆత్మనూన్యత భావన కూడా ఆత్మహత్యలకు మరోకారణంగా చెప్పవచ్చన్నారు. సమస్య వస్తే అందరితో చర్చించి దాని పరిష్కారానికి మార్గం ఆలోచించుకోవాలన్నారు. ఈ రెండు రోజుల శిక్షణలో మానసిక నిపుణులు తెలియజేసిన అంశాలను పూర్తిగా మనస్సుపెట్టి గ్రహించి వాటిని ఇతరులకు తెలియజేయాలని కోరారు. అనన్య ఫౌండేషన్ ఫర్ హ్యాపీనెస్ వ్యవస్థాపకులు స్నేహారావు, బెంగుళూరుకు చెందిన నిమ్హాన్స్ సంస్థ డాక్టర్ అనీష్, డాక్టర్ ఆర్యా తదితరులు మానసిక ఆరోగ్య సంక్షోభంపై చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో గత రెండేళ్లలో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మానసిక ఆరోగ్య సంక్షోభంపై వివిధ కోణాల్లో పలువురు మానసిక నిపుణులు తమ విలువైన సూచనలు, సలహాలు అందజేశారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.ఆశా, ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, ఆర్‌బిఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.మానస, అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి కొనసాగించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఏరియా ఆసుపత్రి కొనసాగించి, జిల్లా ఆసుపత్రిలో రద్దు చేసిన 40 వైద్య పోస్టులు, 350 బెడ్స్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఏలూరుకు మెడికల్ కాలేజీ రావడం సంతోషమేనని, ఆ పేరుతో ఏలూరులో ఉన్న జిల్లా ఆసుపత్రి వైద్య సేవలు రద్దు చేయడం అన్యాయమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల వైద్యంపై శ్రద్ధ లేదని విమర్శించారు. కరోనా సమయంలో కేంద్రంలో బిజెపి మంత్రులు, నాయకులు గోమూత్రం తాగితే కరోనా తగ్గుతుందని ప్రచారం చేశారని గుర్తు చేశారు. చివరకు వారికి కరోనా వస్తే ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందారన్నారు. వైద్య రంగానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనీసం ఐదు శాతం నిధులు కేటాయించాలని మేధావులు, ప్రతిపక్ష పార్టీలు కోరుతుంటే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజా సమస్యలన్నీ నవరత్నాలతోనే పరిష్కారమవుతాయని నమ్మబలుకుతున్నారని అన్నారు. విద్య, వైద్యం వంటి ప్రజల మౌలిక సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లాలో 21 లక్షలు జనాభా ఉందని, ఆ మేరకు జిల్లాలో ఆ ఏరియా ఆసుపత్రులు లేవని అన్నారు. 18 లక్షలు జనాభా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో ఐదు ఏరియా ఆసుపత్రులుంటే, ఏలూరు జిల్లాలో మూడు ఆసుపత్రులే ఉన్నాయన్నారు. ఇప్పుడు ఏలూరులో వైద్య సేవలందిస్తున్న జిల్లా ఆసుపత్రి రద్దు కావడంతో పేదలకు సత్వర వైద్య సేవలు అందడం లేదన్నారు. జిల్లాలో ఏలూరుతోపాటు దెందులూరు, కైకలూరు ప్రాంతాల్లో కూడా ఏరియా ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏలూరు మెడికల్ కాలేజీలో అన్ని స్పెషలిస్ట్ వైద్య యూనిట్లకు అనుమతులు రాలేదని, వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల అందుబాటులోకి రాకుండా ఏలూరు జిల్లా ఆసుపత్రిలో 40 స్పెషలిస్ట్ వైద్య పోస్టులు, 350 బెడ్స్ రద్దు చేయడం అనాలోచిత చర్యని అన్నారు. ఏలూరు ఆసుపత్రిలో రోగులకు నిర్వహించాల్సిన స్కానింగ్, ఇతర పరీక్షలకు బయట ల్యాబ్‌లకు పంపకుండా అన్నీ ఆసుపత్రిలోనే ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, జి.రవికిషోర్, వివివిఎన్.ప్రసాద్, జె.గోపి, మంచెళ్ల ఇసాక్, ఎస్.సత్యనారాయణ, ఏసుబాబు, చల్ల పైడియ్య, నర్సింహమూర్తి, రుక్మనందరావు, రాజేష్, ప్రభు, మీసాల సత్యం పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ధర్నాలో నినదిస్తున్న రైతులు, వ్యవసాయ కార్మికులు

ఆక్వా చెరువుల తవ్వకం ఆపాలి

దేవపూడి సచివాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం దేవపూడి గ్రామ సచివాలయం వద్ద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దు, వ్యవసాయ భూములను కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కౌలురైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉల్లంకి నాంచారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవరావు మాట్లాడారు. ముదినేపల్లి మండలం దేవపూడి ఆయకట్టులో 550 ఎకరాలు వరి భూములుండగా ఇప్పటి వరకు 150 ఎకరాల వరకు ఆక్వా చెరువులు తవ్వేశారన్నారు. మిగిలిన భూములను కూడా ఆక్వా చెరువులుగా మార్చేందుకు ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. జిఒ 7, 15 ప్రకారం పచ్చని పంట భూముల్లో ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వకూడదని, అయితే అక్రమ పద్ధతుల్లో అనుమతి ఇవ్వడం వల్ల పచ్చని పంట భూములు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువుల కాలుష్యం వల్ల వ్యవసాయ భూములు చౌడుబారిపోతున్నాయని, నీటి కాలుష్యంతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. దేవపూడిలో అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులను ధ్వంసం చేసి వ్యవసాయ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలపాటి కుటుంబరావు, బోయిన కృష్ణమూర్తి, వీరంకి కృష్ణ, గూడవల్లి నాగ ముసలయ్య, పెద్ది శ్రీనివాసరావు, కోడూరి రామచంద్రరావు, మట్లపూడి కనకారావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలివ్వాలని స్కూల్ స్వీపర్ల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఏలూరు నగరపాలక సంస్థ స్కూల్ స్వీపర్లు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 49 పాఠశాలల్లో 56 మంది స్కూల్ స్వీపర్లు పని చేస్తున్నారన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 2022 జూన్‌లో 84వ నెంబర్ జిఒ పేరుతో మున్సిపల్ పరిపాలనా శాఖ పరిధిలోని పాఠశాలలను విద్యాశాఖకు బదిలీ చేసిందన్నారు. దీంతో మున్సిపల్ పాఠశాలల స్వీపర్లు, విద్యాశాఖకు బదిలీ అయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల చేసి ఎనిమిది నెలలైనా విద్యా శాఖాధికారులు స్కూల్ స్వీపర్ల జీతాల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీంతో స్కూల్ స్వీపర్లు నాలుగు నెలలుగా జీతాలు లేక అనేక అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను బహిష్కరిస్తామని, పనులు నిలిపివేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమాన్నుద్దేశించి శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి, స్కూలు స్వీపర్ల యూనియన్ అధ్యక్షురాలు జి.స్వాతి, కార్యదర్శి జి.రాజారాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి నాగమణి, రామలక్ష్మి, ప్రమీల, వెంకటరమణమ్మ, ప్రియాంక తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం సమర్పించారు.

నినదిస్తున్న స్కూల్ స్వీపర్లు

మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రౌతుగూడెం వద్ద చింతలపూడి ఎత్తిపోతల పథకం కాల్వపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులను నాబార్డు డిజిఎం కెవిఎస్.ప్రసాద్, టెక్నికల్ కన్సల్టెంట్ ఐఎస్ఎన్.రాజు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంతెనకు సంబంధించి జరిగిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో ఇచ్చిన నిధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ బిల్లుల మంజూరుపై సానుకూలంగా స్పందించారు. అనంతరం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఇ రామకృష్ణ, ఇఇ కృష్ణయ్య, డిఇ శ్రీనివాస్, క్వాలిటీ డిఇ శ్రీనివాస్, గాయత్రి ఏజెన్సీ ప్రాజెక్ట్ మేనేజర్ కె.అజ్మీర, ఎజిఎం శ్రీనివాస్, లాజర్, ఎఇ శ్యామల, వై.రవి పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు : ఎస్‌పి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. సోమవారం ఆయన పట్టణంలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపిడిఒ బి.ప్రవీణ్, ఎఒ సుజాత, ఇన్‌ఛార్జి డిఎస్‌పి పైడేశ్వరరావు, ఎస్‌బి సిఐ వి.రవికుమార్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం

డిఎంహెచ్‌ఒ డి.ఆశ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆయుష్మాన్ భారత్, బేటీ బచావో-బేటీ పడావో, లింగ వివక్ష నిర్మూలన, జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంఆర్‌సి కాలనీ-2 అర్బన్ హెల్త్ సెంటర్ నుండి బాలికల సైకిల్ ర్యాలీని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆశ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆశ మాట్లాడుతూ బాలికలు, మహిళలు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యవంతంగా గడపడానికి ప్రతిరోజూ సైకిల్ తొక్కడం దినచర్యగా తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని, స్త్రీ, పురుషుల బేధం లేకుండా వ్యాయామం చేయాలని అన్నారు. వ్యాయామం ద్వారా అనేక రుగ్మతల నుండి బయటపడొచ్చని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. బిపి, షుగర్, కొవ్వు తదితర సమస్యల నుండి విముక్తి పొందడానికి వ్యాయామం సరైన పద్ధతన్నారు. ప్రధాన కూడలి వరకు సాగిన ఈ సైకిల్ ర్యాలీలో స్కూల్ విద్యార్థినులు, ఆశాలు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ రత్నకుమారి, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు, డిపిఎంఒ డాక్టర్ జ్యోతి, యుపిహెచ్‌సి ఎంఆర్‌సి కాలనీ మెడికల్ ఆఫీసర్ హెచ్ఇ విజయ కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ గోవింద్, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ ఆశ

'ఆసరా' అందరికీ వర్తింపజేయాలని ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో వైఎస్ఆర్ ఆసరా పథకం అన్ని డ్వాక్రా సంఘాలకూ వర్తింపజేయాలని పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ సుభాషిని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ పట్టణంలో చిన్న మహిళా సంఘాలు 900 ఉంటే వాటిలో పది గ్రూపులకు ఆసరా రాలేదన్నారు. ఆ గ్రూపుల మహిళలు తమకు ఆసరా పథకం వర్తించడం లేదని మానసికంగా మదన పడుతున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆసరా పథకం నగదు బాధిత మహిళా గ్రూపుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కె.భాస్కరరావు, చిన్న సంఘాల సభ్యులు రాణి, డి కుమారి, ఆర్.రత్నం తదితరులు పాల్గొన్నారు.

నినదిస్తున్న డ్వాక్రా మహిళలు

5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలి

ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అన్నారు. సోమవారం పిప్పర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యవక్త బాబూరావు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. పెద్దసంఖ్యలో రైతులు, కార్మికులను చలో ఢిల్లీకి సమీకరిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల నేతలు శ్రీను, శ్రీనివాస్, బి.ఎర్రినాయుడు, ప్రసాద్, జి.నాగరాజు, ఎం.అప్పన్న, ఎస్.సంజీవరావు, పి.గోవింద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తికి కృషి చేయండి

కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కైకలూరు

ఇళ్ల నిర్మాణం కోసం పునాదుల వరకూ వేసుకుని ఆగిన లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న ఆసరాను అందిపుచ్చుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కైకలూరులో వైఎస్ఆర్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇళ్ల లబ్ధిదారులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. గతంలో ఇళ్ల నిర్మాణానికి బేస్‌మెంట్ లెవెల్ వరకు వేసుకుని ఆర్థిక స్థోమత లేక మధ్యలో ఆగిపోయిన 500 మంది లబ్ధిదారులకూ ఆర్త హోమ్స్ వారి నిర్మాణ భాగస్వామ్యంతో అతి తక్కువ ఖర్చుతో ఇళ్లు నిర్మించుకోవడానికి అవకాశం ఉందన్నారు. లబ్ధిదారులంతా సదరు సంస్థతో ఒప్పందం చేసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. కాలనీలో ఆర్త హోమ్స్ నిర్మాణ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న ఇళ్లను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకటకృష్ణమోహన్, వైస్ ఎంపిపి మహ్మద్‌జహీర్, సర్పంచి నవరత్నకుమారి, ఎంపిటిసి సభ్యులు, హౌసింగ్ డిఇఇ రమణమూర్తి, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎఇ శేఖర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

నగర పంచాయతీ.. అభివృద్ధి అధోగతి..!

చింతలపూడిలో నెలకొన్న పలు సమస్యలు
కానరాని సెంట్రల్ లైటింగ్..వెలగని వీధిలైట్లు
పబ్లిక్ మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు
పట్టించుకోని అధికారులు

నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ అయినా అభివృద్ధికి నోచుకోవటం లేదు. నగర పంచాయతీ అయిన తర్వాత మొదటి సంవత్సరం 15 శాతం, రెండో సంవత్సరం 15 శాతం మొత్తం 30 శాతం పెరిగినా అభివృద్ధి కనిపించడం లేదు. కనీసం డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చింతలపూడి పట్టణంలో బస్సు డిపో ఉన్నా విజయవాడకు బస్సు సౌకర్యం లేని పరిస్థితి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన బస్‌షెల్లర్‌ని ఇప్పటికీ ఉపయోగించుకోని పరిస్థితి నెలకొంది.

కానరాని సెంట్రల్ లైటింగ్.. వెలగని వీధిలైట్లు

చింతలపూడి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో దుకాణాల షాపుల ఎదుట లైటింగ్ నిలిపివేస్తే చీకటిలో ఇబ్బందులు తప్పడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలని పలుమార్లు స్పందనలో ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకో వడంలేదని వాపోతున్నారు. ఇటీవల వీధిలైట్ల బకాయిలు చెల్లించలేదని విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు తెలుస్తోంది. దీంతో నగర పంచాయతీ అంధకారంలోకి వెళ్లింది.

నిరుపయోగంగా బస్ షెల్టర్

కావురి సాంబశివరావు ఎంపీగా ఉన్న సమయంలో ఆ నిధులతో బస్‌షెల్టర్ నిర్మించారు. ఈ బస్‌షెల్టర్‌ను ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకుంరాలేదు. ఎందుకు వినియోగంలోకి తీసుకురావడంలేదని, ఎవరి పరిధిలో ఉందని, అటు నగర పంచాయతీ, ఇటు ఆర్‌టిసి అధికారులను అడిగినా నేటికీ ఎటువంటి సమాధానం రాలేదని ప్రజలు చెబుతున్నారు. ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు ప్రయాణ సమయంలో బస్సుల కోసం ఎండలోనే పడిగాపులు పడిగాపులు కాస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కానరాని పబ్లిక్ మరుగుదొడ్లు

చింతలపూడికి వ్యాపారం నిమిత్తం, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం అనేక మంది వస్తుంటారు. పబ్లిక్ మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. పాత బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూసే విద్యార్థినులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి నగర పంచాయతీలో సమస్యలను పరిష్కరించిన అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి సూచించారు. మండలంలోని చింతలపల్లి శివారు గోగులంపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం ఎలా, ఎంత పరిమాణంలో తీసుకోవాలో వివరించారు. పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

'ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ బకాయిలు రద్దు చేయాలి'

ప్రజాశక్తి - చాట్రాయి

ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ బకాయిలు రద్దు చేయాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి కొమ్ము ఆనంతం డిమాండ్ చేశారు. మండలంలో గృహ విద్యుత్ వినియోగదారులు 6529 మంది ఉన్నారని, వీరందరూ గత తొమ్మిదేళ్ల నుంచి గృహ విద్యుత్తును ఉచితంగా వినియోగించుకుంటున్నారని చెప్పారు. వీరిలో 2143 మంది రూ.2.33 కోట్లు విద్యుత్ బకాయిలు కట్టాల్సి ఉందని, దీంతో విద్యుత్ అధికారులు వినియోగదారులను ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. లేకపోతే విద్యుత్ కనెక్షన్లు కట్ చేస్తున్నారన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన పేదలు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు విద్యుత్‌ను ఉచితంగా అందించిందని చెప్పారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఎస్‌సి ఎస్‌టిలందరూ విద్యుత్ బిల్లులు వెంటనే కట్టాలని ఒత్తిడి చేయటం మానుకోవాలని, ఎస్‌సి ఎస్‌టిల బకాయిలు ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చెక్కపల్లికి మహాసంగ్రామ పాదయాత్ర

ముసునూరు: మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రారంభమైన మహాసంగ్రామ పాదయాత్ర సోమవారం ముసునూరు మండలంలోకి చెక్కపల్లి గ్రామానికి చేరుకుంది. ఎంఆర్‌పిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కన్వీనర్ కోటేశ్వరరావు చెక్కపల్లి గ్రామంలో బాబు జగజ్జీవన్‌రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎస్‌సి వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ మాట తప్పారన్నారు. అంబాని, ఆదాని వంటివారికి పెద్ద పీట వేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పల్లె జయరాజు, ప్రకాష్‌రావు, హెచ్.సుబ్బారావు, మహిళలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తమ్ముడిని చంపిన అన్న అరెస్టు

ప్రజాశక్తి - గణపవరం

ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోమన్నందుకు తమ్ముడిని హత్య చేసిన అన్న ఉదంతమిది. ఈ ఘటన గణపవరం గొల్లలదిబ్బలో చోటు చేసుకుంది. గణపవరం సిఐ ఎం.సుభాష్, ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక గొల్లలదిబ్బకు చెందిన వేగేశ్న నరసింహరాజు ఎడమ కాలుకు ఇటీవల జరిగిన ఆపరేషన్‌తో అతని కాలి చివరి వేలు తొలగించారు. ఈ క్రమంలో అతను నడవలేకపోతున్నాడు. దీంతో తమ్ముడు కృష్ణంరాజు తన అన్న నరసింహరాజును ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని ప్రతిరోజూ గొడవ చేస్తున్నాడు. ఈ క్రమంలో నరసింహరాజు ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న తన తమ్ముడు క్రిష్ణంరాజు గునపంతో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో కృష్ణంరాజు అక్కడికక్కడే మృతి చెందారు. వీఆర్‌ఒ ఆకుల ప్రసాద్ ఫిర్యాదు మేరకు నరసింహరాజుపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం అతడిని అరెస్టు చేశారు. సిఐ, ఎస్ఐ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. నిందితుడు నరసింహరాజును రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హత్య చేసేందుకు కుట్ర

ఆరుగురి అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను అంతమొందించేందుకు పథకం రచిస్తున్న తరుణంలో ఒకటో పట్టణ పోలీసులు నిందితులను చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఎస్‌పి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కామవరపుకోట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వంక శివశంకర శ్రీనివాసరావు సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. అతనికి తమ్ముడి వరుసైన టి.నరసాపురం మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన చలమల అంజిబాబు భార్యతో శ్రీనివాసరావుకు వివాహేతర సంబంధం ఉంది. భర్తను దూరంపెట్టాలంటూ కూలి పనులకు పంపుతూ శ్రీనివాసరావు ఆమెతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో అంజిబాబు ఇటీవల అనారోగ్యంతో ఎక్కువగా ఇంటి వద్దే ఉండటంతో తమకు అడ్డుగా ఉన్నాడని ఎలాగైనా తొలగించుకోవాలని సుపారీ మర్డర్ గ్యాంగ్‌కు అతడిని హత్య చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వి.వెంకటేష్, షేక్ బాషా సహాయంతో ఏలూరులో గతంలో రౌడీ షీటర్ అయిన పేకట్లబాబు, తన స్నేహితులు పేకట్లబాబు, ప్రశాంత్ కుమార్, నాగార్జునతో కలిసి హత్యకు కుట్ర పన్నారు. ఈ హత్య చేసేందుకు సుపారీ గ్యాంగ్ రూ.15 లక్షలు డిమాండ్ చేయగా తన వద్ద అంత డబ్బులు లేవని రూ.9 లక్షలకు శ్రీనివాసరావు ఒప్పందం చేసుకున్నాడు. ముందుగా రూ.4.50 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాడు. ఈ ఏడాది జనవరి సంక్రాంతి వేడుకల సమయంలో కోడిపందాల్లో హత్య చేయాలని భావించారు. కొన్ని రోజులు హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించారు. కాని కుదరకపోవడం, పూర్తిగా డబ్బులు ముట్టకపోవడంతో వాయిదా వేశారు. ఇటీవల శ్రీనివాసరావు మరోసారి వారిని కలిసి మిగిలిన సొమ్ము ముట్టచెబుతానని హత్య చేయాలని చెప్పాడు. అంజిబాబును హత్య చేసేందుకు పథకం రచించారు. ఏలూరు వన్‌టౌన్ కత్తులు కొనేందుకు వెళ్లారు. రౌడీషీటర్లయిన వీరంతా కత్తులు కొనుగోలు చేయడంతో ఏలూరు వన్‌టౌన్ సిఐ ఆదిప్రసాదుకు సమాచారం అందింది. వెంటనే జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో డిఎస్‌పి పైడేశ్వరరావు పర్యవేక్షణలో నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కత్తులు, రెండు మోటార్‌సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నూజివీడు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన డి.ప్రకాష్ (45) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం నూజివీడు మండలంలోని దిగవల్లిలో పొలం పనులకు వెళ్లాడు. పని ముగించుకుని బైక్‌పై రమణక్కపేటకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గతనెలలో ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన వివాహిత గొల్లపల్లి జ్యోత్స్న హత్య కేసులో నిందితుడు ఆమె భర్తను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ విలేకర్ల నూజివీడు రూరల్ సిఐ కార్యాలయంలో సోమవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. రమణక్కపేట గ్రామానికి చెందిన గొల్లపల్లి జ్యోత్స్న అదే గ్రామానికి చెందిన వ్యక్తితో చనువుగా ఉంటూ తనను మోసం చేస్తుందని ఆమె భర్త నాగమల్లేశ్వరరావు జ్యోత్స్నపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గత నెల ఫిబ్రవరి తొమ్మిదో తేదీన రాత్రి పది గంటల సమయంలో నాగమల్లేశ్వర తన భార్య జ్యోత్స్నను కత్తితో పొడిచాడు. తీవ్ర గాయాలపాలైన ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గత నెల 28న మృతి చెందింది. ఈ కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడు నాగమల్లేశ్వరరావును అరెస్టు చేశారు. హత్య కేసును ఛేదించిన పోలీసులను డిఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, ముసునూరు ఎస్ఐ ఎం.కుమారస్వామి, నూజివీడు పట్టణ ఎస్ఐ జి.వెంకటేష్, రూరల్ ఎస్ఐ కె.రామకృష్ణ, చాట్రాయి ఎస్ఐ కె.ప్రతాపరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గురులేశు శ్రీను, సిబ్బందిని డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్ అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తహశీల్దార్ స్లీవజోజి తెలిపారు. మండలంలోని తాడువాయి గ్రామంలో కోమటి గుంట బాలకృష్ణ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రాగా తహశీల్దార్ స్లీవ జోజి ఆదేశాల మేరకు పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్ కె.సుధాకర్, గ్రామ రెవెన్యూ అధికారి వీరభద్రరావు తనిఖీలు నిర్వహించి 22 బస్తాల్లో నిల్వచేసిన తొమ్మిది క్వింటాళ్ల బియ్యం గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ.17,874 ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

టాస్క్‌ఫోర్స్ టీమ్ అంకితభావంతో పనిచేయాలి

సచివాలయాల శాఖ సామాజిక పరివర్తన మార్పు విభాగం కో-ఆర్డినేటర్ టివిఎన్.స్నేహాసన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మాట్లాడుతున్న టివిఎన్.స్నేహాన్

గర్భిణులు, బాలింతలు, బాలికల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపర్చేందుకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్ అంకితభావంతో పనిచేయాలని సచివాలయాల శాఖ సామాజిక పరివర్తన మార్పు విభాగం కో-ఆర్డినేటర్ టివిఎన్.స్నేహన్ సూచించారు. ప్రతి గ్రామ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. మండలంలోని కెఆర్.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సామాజిక ఆరోగ్య అధికారులకు, ఎఎన్‌ఎంలకు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎన్.స్నేహన్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, బాలికల ఆరోగ్య పరిస్థితులు మెరుగు పర్చేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ అనివార్యమైందని చెప్పారు. ఏలూరును రక్త హీనత రహిత జిల్లాగా మార్చేందుకు టాస్క్‌ఫోర్స్ టీమ్ అంకితభావంతో పరిచేయాలని కోరారు. డాక్టర్ వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లో పని చేసే సామాజిక ఆరోగ్య అధికారి టీమ్ లీడర్‌గా, ఎఎన్‌ఎం, ఆశా వర్కర్, అంగన్ వాడీ కార్యకర్త, పాఠశాల ఆరోగ్య అంబాసిడర్, గ్రామ సంఘం అధ్యక్షురాలు సభ్యులుగా ఈ టాస్క్‌ఫోర్స్ టీమ్ నిరంతరం పర్యవేక్షించి రక్తహీనత రహిత సమాజానికి కృషి చేయాల్సి ఉందన్నారు. అంటువ్యాధులు, రోగాల బారిన పడిన వారికి తగు ఆరోగ్య సలహాలు ఇస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.అనూష మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ టీమ్ ప్రతి 15 రోజులకోసారి సమావేశం నిర్వ హించుకోవాలని సూచించారు. గర్భిణులకు, బాలింతలకు హిమోగ్లోబిన్ పరీక్షలు ప్రతి నెలా నిర్వహించి రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. అనతం రం కెఆర్.పురం పరిధిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను స్నేహన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎ.చందన్‌వ ాధుర్, పబ్లిక్ హెల్త్ నర్సు ఎం.శాంతకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ బి.చంద్రావతి, సామాజిక ఆరోగ్య అధికారులు డి.పద్మశ్రీ, కె.గంగాభవాని, బి.సుధారాణి, మహిళా పోలీసులు డి.గంగాభవాని, బి.పద్మావతి, సంక్షేమ కార్యదర్శి సిహెచ్.శేఖర్, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - చాట్రాయి

స్థానిక జెడ్‌పి హైస్కూలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నలుగురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మండలంలో నలుగురు మహిళా ఉపాధ్యాయులు కె.మేరీనారాణి, కె.స్వర్ణ కుమారి, జి.అనితరాణి, ఎన్.స్రవంతిలను దుశ్శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వీరకోటి మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహిళ దినోత్సవాలు నిర్వహిస్తుందని చెప్పారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే విద్య ఒక్కటే మార్గమని ఆయన అన్నారు. ఆరుగొలనుపేట ఎంపియుపి ప్రధానోపాధ్యాయులు కె.నాగరాజు మాట్లాడుతూ మహిళలు రాణించాలంటే పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. సామాజిక, ఆర్థిక సమానత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.పెద్దరమేష్, సిహెచ్.రఘు, నాయకులు జి.సత్యనారాయణరెడ్డి, పి.రత్తయ్య, వెంకటరామయ్య, జి.రామారావు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద మరింత పెంచాలి

ప్రజాశక్తి - కలిదిండి

చెత్త నుంచి సంపద మరింత పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా డిపిఆర్‌సి శిరీష సూచించారు. మండలంలోని పడమటిపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణ విధానాన్ని ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలన్నారు. సంపద కేంద్ర నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సానా మీనా సరస్వతి, కార్యదర్శి నస్రీన్ బేగం, నాయకులు ఎస్.వెంకటరామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దింట్లమ్మ జాతర

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని కొల్లేటికోటలో ఉన్న పెద్దింటి అమ్మవారి జాతర ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. 14వ రోజు సోమవారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ పూళ్ల గ్రామానికి చెందిన కల్లి నారాయణ అప్పారావు, కృష్ణశ్రీ దంపతులు చేయించారు. సాయంత్రం పంచహారతులు, రాత్రి తెనాలికి చెందిన ఎవి.సుబ్బారావు కుమారుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో రుక్మిణీ కళ్యాణం నాటకం ప్రదర్శించారని ఆలయ కార్యనిర్వహణాధికారి కెవి.గోపాలరావు తెలిపారు.

పెద్దింట్లమ్మ సన్నిధిలో కామినేని

కైకలూరు : తన రాజకీయ జీవితంలో కొల్లేటి ప్రజల కోసం ఎంతో చేశానని, మరెంతో చేయాల్సి ఉందని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. జాతర సందర్భంగా పెద్దింట్లమ్మను ఆయన సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో కొల్లేరు ప్రజల సంక్షేమానికి వారి జీవనోపాధికి ఎంతో కృషి చేశానని, తాను మంత్రిగా ఉన్న సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సర్కార్ కాలవపై వంతెన నిర్మాణానికి కృషి చేసినట్లు చెప్పారు. ఆయనతో పాటు బలే ఏసురాజు, జల్లూరి వెంకన్న, సుబ్బరాజు, కొల్లి బాబి, ఇఒ గోపాలరావు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

మహిళలు వారికి ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నాగిరెడ్డిగూడెం బాలికల రెసిడెన్సియల్ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. చింతలపూడి ఇన్‌ఛార్జి న్యాయమూర్తి పి.పరేష్‌కుమార్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో మండలంలోని రెసిడెన్షియల్ స్కూల్‌లో బాలికలకు మహిళ చట్టాలపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వివాహ చట్టాల గురించి వివరించారు. అన్యాయానికి గురైన వారికి న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, సహాయం కోర్టులు పని చేసే ప్రతి చోటా అందిస్తున్నారన్నారు. దానిలో భాగంగా మహిళలు, పిల్లలు, ఎస్‌సి, ఎస్‌టిలు, వికలాం గులు, ప్రకృతి విపత్తులకు గురైనవారు, నిందితులు, సంవత్సరానికి రూ.మూడు లక్షల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులని తెలిపారు. భర్త ద్వారా హింసకు గురైన మహిళలకు సెక్షన్ 498(ఎ) చట్టం, మనోవర్తి చట్టం, గృహ హింస చట్టం ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనక దుర్గా భవాని, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నామినేట్ చేసిన మెంబర్, పారా లీగల్ వాలంటీర్ అక్బర్ అలీ పాల్గొన్నారు.

మెప్మా ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మెప్మా అధికారిణికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మెప్మా ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కార్యదర్శి షేక్ సుభాషిని మాట్లాడుతూ పట్టణంలో చిన్న సంఘాలకు అనేక ప్రభుత్వ పథకాలు అందిస్తున్న వీరికి కనీస వేతనాలు లేవని తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.ఎనిమిది వేలు కూడా పూర్తి స్థాయిలో ఇవ్వటం లేదన్నారు. పెర్ఫార్మెన్స్ పద్ధతిలో ఇస్తూ కోతలు విధిస్తున్నారని తెలిపారు. నష్టాల్లో ఉన్న ఎస్‌ఎల్‌ఎఫ్‌ను బాగు చేసే ప్రయత్నం అధికారులు చేయటం లేదన్నారు. వాపోయారు. లాభాల్లో ఉన్న ఎస్‌ఎల్‌ఎఫ్‌ల నుంచి అధికారులు రూ.రెండు వేలు ఆర్‌పిలకు ఎందుకు ఇప్పించడం లేదని ప్రశ్నించారు. పట్టణంలో మెప్మా ప్రాజెక్టుకైతే కార్యాలయం ఉందని, సమావేశం ఏర్పాటు చేస్తే కూర్చోవడానికి హాలు లేదని చెప్పారు. మెప్మా ఆర్‌పిలకు మీటింగ్ హాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఐడీ కార్డ్స్, యూనిఫాం ఇవ్వాలని కోరారు. అధికారులు స్పందించి ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని మెప్మా అధికారిణి సిఒ రాధాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటి యు టౌన్ అధ్యక్షులు పి.సూర్యారావు, మెప్మా అర్‌పిల సం ఘం అధ్యక్షులు వి.నాగలక్ష్మి, జె.మేరీ, ఇ.జయఅనూష, సుహాసిని, వాణి, వాణిశ్రీ, స్వప్న స్వరూప, మంగా జ్యోతి పాల్గొన్నారు.

ఎస్‌సి గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

స్థానిక బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు ఎం.వసంతరావు కోరారు. ఈ నెల నాలుగో తేదీన చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పరిశీలనలో భాగంగా చింతలపూడి విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఎస్‌సి గురుకుల పాఠశాలను సందర్శించినట్లు చెప్పారు. పాఠశాలను అభివృద్ధి చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అసంపూర్తిగా ఉన్న నూతన భవన నిర్మాణం పూర్తి చేయాలని రామకృష్ణ డిమాండ్ చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి గాని, విద్యాశాఖమంత్రి గాని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గాని గురుకుల పాఠశాలను సందర్శించాలని రామకృష్ణ లేఖ రాసినట్లు తెలిపారు. ఆ లేఖను సోమవారం సిపిఐ నాయకులు విడుదల చేశారు. 630 మంది చదువుతున్న ఈ గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయాలని, నూతన భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శులు పూల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు, సిపిఐ మండల కమిటీ సభ్యులు ఎస్‌కె.మస్తాన్, ఎస్‌కె.లాల్, బిఎఐవైఎఫ్ మండల కార్యదర్శి తొర్లపాటి రాజు పాల్గొన్నారు.

రోడ్డు వెంబడి ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురం రోడ్డులో ఆక్రమణలు తొలగింపు పనులు మున్సిపల్ అధికారులు వేగవంతం చేశారు. స్థానిక బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయ సమీపంలో ఇటీవల రోడ్డు ఆక్రమించిన అనధికార నిర్మాణాలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక అధికారి జగదీశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో మున్సిపల్ రెవెన్యూ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిపారు. రోడ్డు అక్రమణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశామన్నారు. తాను విధులు చేపట్టి ఏడు నెలల కాలంలో ఎనిమిది మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నాలుగు ఆక్రమణలు తొలగించామని చెప్పారు. ఇటీవల బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయ సమీపంలో రోడ్డు ఆక్రమణలు చేసి అనధికార నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు ఆక్రమణలను కూల్చివేశామని తెలిపారు.

నేత్రాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి

ఏలూరు : నేత్రాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారు సూచించారు. స్థానిక పోణంగి మండల పరిషత్ పాఠశాలలో ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆశ్రమ ఆసుపత్రి వైద్య బృందంతో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మంది పాఠశాల విద్యార్థులకు, వంద మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో అవసరమైన వారికి మందులు అందించారు. కళ్లజోళ్లు అవసరమైనవారిని, కంటి ఆపరేషన్లు అవసరమైన గురితంచి వీరందరికి ఉచితంగా కళ్లజోళ్లు, ఆపరేషన్ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో డాక్టర్ వై.రమ్య, ఆశ్రమ ఆసుపత్రి పిఆర్ఒ పి.ఆనంద్, టెక్నీషియన్ హారిక, ఎస్.విజయ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరు స్మార్ట్ సిటీ క్లబ్ పూర్వపు అధ్యక్షులు పి.మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. క్లబ్ కార్యదర్శి మార్గాని శ్రీనివాస్, జిల్లా నాయకులు లేళ్ల వెంకటేశ్వరరావు, లయన్స్ జిల్లా రీడింగ్ యాక్షన్ ప్రోగ్రాం చైర్ పర్సన్ విజిఎంవిఆర్.కృష్ణారావు, క్లబ్ డైరెక్టర్ బి.సురేంద్ర, క్లబ్ కోశాధికారి షేక్ ముస్తఫా అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారు పోణంగి పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎప్పటికప్పుడు ఆరోగ్య సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ట్రెజరర్ ముస్తఫా ఆలీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంబాబు, కె.దేవీప్రసాద్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో ఉప ఎన్నికల కోడ్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలో ఉప ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన స్పందన కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు ఎంపిడిఒ కె.వాణి తెలిపారు. ఉప ఎన్నికల్లో భాగంగా అడవినెక్కలం సర్పంచి ఎన్నిక, ఈదులగూడెం ఏడో వార్డు, సింహాద్రిఅప్పారావుపేట పంచాయతీ నాలుగో వార్డు, కృష్ణవరం పంచాయతీ ఏడో వార్డు, బొద్దనపల్లి ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె పోలింగ్‌స్టేషన్ల పబ్లికేషన్ వెలువరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, ఎంపిడిఒ, కార్యాలయ ఎఒ అబ్దుల్ సలాం, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి బి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు కె.సంగమయ్య, సిహెచ్.పుల్లారావు, ఎం.శ్రీనివాసు, కె.నవీన్‌బాబు పాల్గొన్నారు.

వడ్లమానులో రీ సర్వే

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని వడ్లమాను గ్రామంలో రీ సర్వేలో భాగంగా డ్రోన్ సర్వేను సోమవారం ప్రారంభించారు. వడ్లమాను గ్రామ పంచాయతీ పరిధిలోని 3015 ఎకరాలకు సుమారు రెండు వేల ఎకరాలను డ్రోన్ సహాయంతో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎల్‌ఆర్ డిటి కె.లక్ష్మీనా ంచారమ్మ, మండల సర్వేయర్ గంగరాజు, గ్రామ రెవెన్యూ అధికారి టి.నాగరాజు, గ్రామ సర్వేయర్ టి.దుర్గ, పంచాయతీ కార్యదర్శి వెంకన్నబాబు, సర్పంచి జె.లక్ష్మీకుమారి, ఎంపిటిసి సభ్యులు ఆర్.సత్యనారాయణ, ఉపసర్పంచి ఎన్.రాంబాబు, మాజీ సర్పంచి జె.వంశీకృష్ణ, వైసిపి గ్రామ అధ్యక్షులు ఆర్.కృష్ణారావు పాల్గొన్నారు.

రీ సర్వే నిష్పాక్షపాతంగా జరగాలి : సిపిఎం

రీ సర్వే నిష్పాక్షపాతంగా జరగాలని సిపిఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. వడ్లమాను గ్రామంలో నిర్వహించిన డ్రోన్ సర్వేను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, జె.గోపాలరావు పాల్గొన్నారు.

'స్పందన'కు 2 అర్జీలు

ద్వారకాతిరుమల : మండలంలోని తహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు అర్జీలు ఫిర్యాదుదారులు అధికారులకు అందించా రు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, తహశీల్దార్, మండల విద్యాశాఖాధికారి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

బుట్టాయగూడెం : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి టిడిపి మండల నాయకులు చేయూత అందించారు. మం డలంలోని పడమటిరేగులగుంట గ్రామంలో ఆది వారం సంభవించిన అగ్ని ప్రమాదంలో బరగడ సారలమ్మ కుటుంబం సర్వం కోల్పోయింది. విష యం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు బాధిత కుటుంబానికి సోమవారం నిత్యావసర సరు కులు, ఆర్థిక సాయం అందించారు. టిడిపి మండల కన్వీనర్ సోంబాబు, నాగే శ్వరరావు, వెంకాయమ్మ, భీమేశ్వరరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లి గూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 636 of 2022 in I.A. No. 455 of 2020
in O.S. No. 583 of 2000
Between :
కొనారపు నాగమ్మ (డెడ్) వగైరా .... పిటీషనర్లు
మరియు
ఈసరపు సన్యాసమ్మ వగైరా ..... రెస్పాండెంట్లు
పై నెంబరు గల పిటీషనులో R14 అయిన పెనింటి నూకరాజు, తండ్రి :రమణ అనే పేరున శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం ఎన్ని పర్యాయములు బత్తా కట్టినప్పటికి అతను ఉద్దేశ్యపూర్వకంగా శ్రీ కోర్టువారి సమన్లు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా R14 కు తెలియపర్చమని ది.24.02.2023వ తేదీ గల ఆర్డరు ద్వారా మీకు తెలియపర్చడమైనది. సదరు విషయం గురించి మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్న ది.27.03.2023వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా హాజరు అయి తెలుపుకోవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు తదుపరి విచారణను కొనసాగించెదురు అని తెలియపర్చడమైనది.
స్థలం : తాడేపల్లిగూడెం తేది : 06.03.2023
ఇట్లు
కె. సూర్యచంద్రరావు, పిటీషనర్లు తరుపున న్యాయవాది
తాడేపల్లిగూడెం - 534101. సెల్ : 9581919670

PUBLIC NOTICE
This Public Notice is given on the instructions of my client **TAMMU AMMAJI,** W/o. Tammu Venkateswara Rao of Velpuri Village, Tanuku Mandalam, West Godavari District, A.P.,
That my client has acquired the below mentioned schedule property under a **Regd. dated 18-6-2018 Sale deed D.No. 4230/2018** excuted by **(1) Gunnam Varahalu,** W/o. late Gunnam Krishna Murthy, **(2) Gunnam Srinivasa Varaprasad,** S/o. late Gunnam Krishna Murthy, **(3) Gunnam Basavayya,** S/o. late Gunnam Krishna Murthy from the link document of 2526/1959, Actual document holder of 2526/1959 is Gunnam Krishna Murty, but he died on 08-12-1989. After the death of Gunnam Krishna Murthy, his family members excuted the sale of property to my client with out Death Certificate and family member certificate. Therefore this public notice is issued to all that anybody belongs to Gunnam Krishna Murthy family has any claims over schedule property, may shall comme forward with documentary proof with in 7 days from the date of this notice to the undersigned, else if shall be deemed that there are no claims or objections over the schedule property and the transaction will be proceeded with.
DOCUMENT SCHEDULE
West Godavari Dist., Bhimavaram District Registry, Tanuku Sub Registration Office, Tanuku Mandal, Velpur Village in R.S. No. 148/9 of site 147.68 sq.yards of following boundaries.
EAST: Canal Bund Road.
WEST: Site of Varre Bhargav Sree Siva Sai.
NORTH: Site of Varre Yugendar and Varre Surya Satyanarayana.
SOUTH: Site of Tummala Murali Krishna and others.
PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dt.,
Cell: 7702311197

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No:
202-206/General & GGMP-Grant/2022-23, Dated. 06-3-2023
The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Providing CC Roads, Conversion of Existing Building into Ward Secretariat, Improvement to the Fire Station Center and Construction of Multipurpose Community Hall at various places in Municipal Corporation, Eluru"** Total No. of works is **5** with an amount of Rs. **35.37** Lakhs.
Tender schedules are available on e-procurement market place from 07-03-2023. Last date of receipt of tenders is 14-03-2023. Further details can be seen at e-procurement market place at www.apeprocurement.gov.in or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).
Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU